క్లుప్తంగా

క్రీడాకారుడిని అభినందించిన ఎమ్మెల్యే



వెల్దుర్తి: మండలంలోని మండాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కాంద్రు కొండ యువరాజశేఖర్ జాతీయ స్థాయి వాలీ బాల్, బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ నెల 10వ తేది నుంచి 14 లోపు జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు, ఒడిస్సా రాష్ట్రంలోని పూరీలో జరిగే బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 14 వాలీబాల్, బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక కావటంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి యువరాజశేఖర్‌ను క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విద్యనభ్యసించే యువ రాజశేఖర్ క్రీడల పట్ల మక్కువతో మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం హర్షణీయమన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారు కష్టపడి సాధన చేస్తే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుగోపాలరావు, ఉపాధ్యాయుడు పల్లపాటి ఆంజనేయులు, సాని కృష్ణమూర్తి తదితరులున్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు



దాచేపల్లి : యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శిగా వట్టెపు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. స్థానిక ఏలియంపేట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుని నరసరావుపేటలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు చెప్పారు. జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు ఎన్నిక పట్ల స్థానిక యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పి.రాజారావు, నాయకులు తగరం ఆనంద్‌కుమార్, నాగెండ్ల ఏసయ్య, షేక్ మస్తాన్‌వలి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

98 శాతం పింఛన్లు పంపిణీ
కమిషనర్ వేణుబాబు



మాచర్ల: పట్టణంలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబు సోమవారం తెలిపారు. మొత్తం 6,407 మంది సామాజిక పింఛనుదారులు ఉండగా 180 మంది మినహా మిగిలిన వారికి పింఛను పంపిణీ పూర్తి చేశారన్నారు. 160 మంది సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. పింఛను పొందని వారు జనవరి, ఫిబ్రవరి నెలలో పాతబకాయిలతో పొందే అవకాశం ఉందని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో శ్రీకృష్ణ జనరల్ హాస్పటల్ నేతృత్వంలో సోమవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని శ్రీకృష్ణ జనరల్ హాస్పటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల నివారణ సులభమని, చలి కాలంలో గోరువెచ్చని నీరు తాగాలని, రాత్రి, తెల్లవారుజామున ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. 300 మంది రోగులకు ఊపిరితిత్తులు, కాలేయం, లివర్, గ్యాస్ సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కస్టమర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకుల నుంచి కస్టమర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సులో శిక్షణ కోసం మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీ సోమవారం తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణ కోర్సు అనంతరం ఉపాధికల్పించబడుతుందని చెప్పారు. పదవతరగతి ఆపైన చదువుకుని 15 నుంచి 45 వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్, చదువుకున్న అర్హత మార్కుల సర్టిఫికెట్ల జిరాక్స్‌కాపీలు, ఫొటోలు రెండు జతచేయాలన్నారు. దరఖాస్తు చేయదలచుకున్న అభ్యర్థులు బాపతు అంజిరెడ్డిని 9494986164 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఈనెల 5వ తేదీవరకు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు.

గల్లీయే.. మూత్రశాల

- మాల్స్, హాస్పటల్స్‌తో విస్తరిస్తున్న పట్టణం
- పలు గ్రామాల నుంచి పనుల నిమిత్తం ప్రజల రాక
- మూత్రశాల లేక ఇబ్బందులు పడుతున్న వైనం



పిడుగురాళ్ల పట్టణంలోని హాస్పటల్ ప్రాంతం

పిడుగురాళ్ల: రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న పిడుగురాళ్ల పట్టణంలో హాస్పటల్ సెంటర్ విస్తరిస్తుంది. షాపింగ్ మాల్స్, హాస్పటల్స్‌తో సెంటర్ పెరుగుతుంది. దీంతో నిత్యం ప్రజల రాకపోకలు భారీగా జరుగుతున్నాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం పిడుగురాళ్లకు వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటోంది. అయితే గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కనీస అవసరమైన మూత్ర విసర్జనను పంటి బిగువన బిగబట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ఒక్క మూత్రశాల (పబ్లిక్ టాయిలెట్) లేకపోవటం వలన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఎల్ఎస్ పిక్చర్ ప్యాలెస్ వద్ద తొలగింపు

గతంలో ఎల్ఎస్ పిక్చర్ ప్యాలెస్ వద్ద మరుగుదొడ్డిని నిర్మించారు. అయితే కొన్ని రాజకీయ కారణాలు, పెద్ద మనుషుల పట్టింపు వలన ప్రజలకు ఉపయోగపడే మరుగుదొడ్డి (పబ్లిక్ టాయిలెట్)ను పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి ప్రజలు మూత్ర విసర్జనకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దుర్వాసన వెదజల్లుతుంది

పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్క గల్లీ నేడు మూత్రశాలగా మారిపోయింది. హైస్కూల్‌లో సుమారు 2,300 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఎక్కువ మంది ఈ ప్రాంతంలో మూత్రం పోయటంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే గల్లీలో నుంచి మహిళలు వెళ్లాలన్నా, రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఈ ప్రాంతంలో మరుగుదొడ్డి లేకపోవటం వలనే ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో హైస్కూల్ పక్క గల్లీనే మూత్రశాలగా మార్చుకోవాల్సి వస్తుందని స్థానికులు తెలుపుతున్నారు. అందుకే ప్రజల రద్దీ రోజు రోజుకు పెరుగుతుండటంతో ప్రజలకు ఉపయోగపడే మరుగుదొడ్డిని హాస్పటల్స్ ప్రాంతంలో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



హైస్కూల్ పక్కన గల్లీలో ఇలా...

మరుగుదొడ్డి నిర్మించాలి



హాస్పటల్స్ ప్రాంతంలో నూతనంగా షాపింగ్ మాల్స్ బాగా పెరిగాయి. దీంతో ప్రజల రద్దీ బాగా పెరిగిపోయింది. పట్టణం నుంచే కాకుండా గ్రామాల నుంచి కూడా ప్రజల రద్దీ పెరిగింది. ఈ ప్రాంతంలో మరుగుదొడ్డి లేకపోవటం వలన ప్రజలు మూత్రశాలకు వెళ్లే అవకాశం లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం.

– నారాయణ, పిడుగురాళ్ల

హైస్కూల్ గల్లీనే వాడుతున్నారు



మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ పక్క గల్లీనే మూత్రశాలగా వాడుతున్నారు. అలా కాకుండా ఈ హాస్పటల్ ప్రాంతంలో మరుగుదొడ్డి నిర్మిస్తే ప్రజలకు ప్రధాన సమస్య పరిష్కరించినట్లు అవుతుంది. ఈ ప్రాంతంలో దుర్వాసన ఎక్కువగా ఉంది.

– అప్పారావు, పిడుగురాళ్ల

ముగిసిన కార్తిక మాసం



గంగమ్మ తల్లి ఆలయంలో పూలతో శివ లింగాకారం ఏర్పాటు చేస్తున్న భక్తులు



మాచర్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

గురజాల : హిందువులు ఎంతో పవిత్రంగా భావించే కార్తిక మాసం సోమవారంతో ముగిసింది. నెల రోజులుగా శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. కార్తిక అమావాస్య అనంతరం వచ్చు పాడ్యమిని పోలి పాడ్యమిగా భక్తులు నిర్వహిస్తారు. పోలి పాడ్యమిని పురస్కరించుకుని మహిళలు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి పోలి దీపాలు వదిలారు. పోలి దీపాలు వదలడంతో కార్తిక మాసం ముగుస్తుంది.

గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు

పిడుగురాళ్ల: కార్తిక మాస ముగింపును పురస్కరించుకొని పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో పూలతో శివలింగాకారాన్ని ఏర్పాటు చేశారు. అలాగే చుట్టూ ప్రమిదలను ఏర్పాటు చేసి అందులో ఒత్తులను వెలిగించారు. మహిళలు విశేషంగా హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్రశాలలో కృష్ణానదికి పూజలు

సత్రశాల(రెంటచింతల): పరమేశ్వరునికి, శ్రీ మహావిష్ణువుకి ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం ముగింపు సందర్భంగా సోమవారం పోలి స్వర్గం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో దేవస్థానం ప్రధాన అర్చకులు మల్లికార్జునశర్మ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర కృష్ణానదికి పూజలు నిర్వహించి దీపాలను వెలిగించి హారతినిచ్చారు. అర్చకులు మల్లికార్జునశర్మ మాట్లాడుతూ కార్తిక మాసం చివరి రోజున 30 దీపాలను వెలిగించి నీటిలో వదిలితే మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం వస్తుందన్నారు. ఆచారం ప్రకారం వీలైతే ఈ రోజు బ్రాహ్మణులకు దీపాన్ని గానీ స్వయంపాకాన్ని గానీ దానం చేస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మున్నా లింగయ్య పాల్గొన్నారు.

కార్తిక మాస ముగింపు పూజలు.. అన్నదానాలు

మాచర్ల : కార్తిక మాస ముగింపు పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని శివాలయాల్లో మహిళలు భారీ సంఖ్యలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. దీపాలు వెలిగించి ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామప్ప, శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి, గంగా పార్వతి నగరేశ్వరస్వామి దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయం, కోదండరామాలయంలో అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించిన వారిపై విచారణ చేయండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దుర్గి: సాయి బృందావనం అపార్ట్‌మెంట్ వెనుక భాగంలో అడంగల్ / సర్వే నెంబర్ ప్రకారం కొలతలు కొలిచి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌కు అపార్ట్‌మెంట్ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 అడుగుల బాట అని గ్రామ పెద్దలు పేర్కొన్నారని, దానిని కొందరు ఆక్రమించారని ఈ విషయంపై విచారణ జరిపి అక్కడ నివసించే ప్రజలు, కుటుంబాల వారు రాకపోకలు సాగించేలా న్యాయం చేయాలని కోరారు. రికార్డుల ప్రకారంగా స్వామి వారు జమ్మికి వెళ్లుటకు, కాలనీ వాసులకు రాచబాటగా వేయుటకు 1బి రిజిస్టర్‌లో పొందుపరచిన హద్దుల ప్రకారం సుమారు 80 అడుగుల బాటను సర్వే చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌వీ నారాయణ, భీమా అంజయ్య, వి.శ్రీనివాస్, కోటేశ్వరరావు, నరసింహ తదితరులున్నారు.

రూ.42 లక్షలతో డ్రైయినేజీ పూడికతీత పనులు



పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మాచర్ల : పట్టణంలో సాగర్ రింగ్ రోడ్డు నుంచి గుంటూరు రోడ్డులోని నెహ్రూనగర్ కోర్టు చివరి వరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో రూ.42 లక్షల వ్యయంతో డ్రైయినేజీ నిర్మాణ, పూడిక తీత పనులు వేగంగా జరుగుతున్నాయి. పూడిక పేరుకు పోయి వర్షాలు కురిసిన సమయంలో నీరు ముందుకు పారకుండా రహదారులపై పారుతూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో పూడిక నిర్మాణ పనులు జరిపించారు. వారం రోజులుగా ప్రధాన మెయిన్ రోడ్డు రెండు వైపులా డ్రైయినేజీలో పూడిక తీత, నిర్మాణ పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు జి.అరుణకుమారి కోటిరెడ్డి, చందు, దస్తగిరితో పాటు ఎం.శ్రీనివాస్‌లు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు. ప్రజలకు డ్రైయినేజీ సమస్య తీరనుందని మున్సిపల్ చైర్మన్ నరసింహారావు తెలిపారు. కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో అవకతవకలు లేకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



రెంటచింతల: మండలంలోని పాలువాయి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలు అయిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వృద్ధురాలు ఈశ్వరమ్మ నివాసం నుంచి ఆరు బయటకు వచ్చి నిలబడిన సమయంలో ధాన్యం లోడుతో ఉన్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో ఈశ్వరమ్మకు లారీ టైర్ బలంగా తగలడంతో కాలు విరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. ఆమె కుమారుడు వినాయకరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.



ప్రమాదభరితంగా కాలువ వంతెన

సైడ్ వాల్స్ ఏర్పాటు చేయరూ..

గురజాల నుంచి మాడుగుల పోవు రహదారి మధ్యలో షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో గల కాలువ వంతెన ప్రమాద భరితంగా మారింది. కాలువపై వంతెనకు ఇరువైపులా సైడ్ వాల్స్ లేకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్న వంతెన కావడం సైడ్ వాల్స్ లేకపోవడంతో ఈ దారిలో ప్రయాణించే వారికి ఇబ్బందికరంగా ఉంది. ప్రమాదాలు జరగకుండా అధికారులు వెంటనే స్పందించి కాలువ వంతెనపై సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – గురజాల

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల గ్రామానికి చెందిన షేక్ షరీఫ్(45) గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పెన్షన్ నిమిత్తం మేడికొండూరు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో సిరిపురం బాలయేసు మందిరం సమీపంలో గుంటూరు నుంచి పెదకూరపాడు వెళుతున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో షరీఫ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. షరీఫ్ కిందపడగా లారీ ముందు టైర్లు షరీఫ్ మీదుగా వెళ్లాయి. షరీఫ్ మృతి చెందగా, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత శిక్షణతో ఉపాధి

మాచర్ల : మాచర్లలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు సోమవారం తెలిపారు. జిల్లాలోని కొన్ని కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు మాచర్ల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ కిరణ్ నాయక్, సెల్ 7842747682 నంబరులో సంప్రదించాలన్నారు.

దుప్పట్లు పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాలలో నివసిస్తున్న వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని లిటిల్ స్కూల్ నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి సున్నపు బట్టీల వద్ద పని చేసే కార్మికులు, రోడ్డు పక్కన నివసించే అనాథ వృద్ధులకు సుమారు 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు రూ.10 వేలతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఫొటో స్టూడియోలో చోరీ

పిడుగురాళ్ల: ఫొటో స్టూడియోలో సుమారు రూ.లక్ష విలువ చేసే సామగ్రి చోరీకి గురైన ఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో ఉన్న టీవీఆర్ ఫొటో స్టూడియోలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్టూడియో తాళాలు పగలగొట్టి స్టూడియోలో ఉన్న కెమెరా, స్టాండ్, ఇతర సామగ్రిని దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు శెట్టిమళ్ల కోటేశ్వరరావు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి బాధితుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

బెల్లంకొండ: విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం చోటు చేసుకుంది. గేదె యజమాని గ్రామానికి చెందిన కంభం షేక్ సుభానీ తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగా ఇంట్లో నుంచి నీళ్లు తాగించేందుకు గేదెను వదలగా ఇంటి ముందు ఉన్న ఇనుప స్తంభాన్ని తాకడంతో, విద్యుత్ షాక్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ సుమారుగా రూ.70 వేల వరకూ ఉంటుందన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుభాని తెలిపారు.

వీరారాధన ఉత్సవాలలో సహపంక్తి భోజనాలు



భోజనాలకు పూజ చేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

కారెంపూడి: పీఠాధిపతి రాకుండానే బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని సోమవారం మధ్యాహ్నం నిర్వాహకులు అమలు చేశారని ఆవేదన చెందిన పల్నాటి వీరాచారులు తిరిగి చాపకూడు సహపంక్తి భోజనాలను సోమవారం రాత్రి 9.30 గంటలకు వీరుల గుడిలో నిర్వహించారు. భోజనరాసులకు పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరుల గుడి ముఖ మండపంలో చుట్టూ కూర్చున్న ఆచారవంతులు ఉత్సవాలకు వచ్చిన భక్తులకు స్వయంగా పీఠాధిపతి భోజనాలను వడ్డించి ఆచారాన్ని నెరవేర్చారు. వీరుల గుడి పూజారులు వీరచార వంతులు భోజనాలను వడ్డించారు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం పీఠాధిపతి చాపకూడు మండపానికి వస్తుండగానే తొందరపడి నిర్వాహకులు చాపకూడు సహపంక్తి భోజనాలను ప్రారంభించారని, నిర్వాహకులు చాపకూడు సంప్రదాయాలను జిల్లా పాలనా అధికారులకు ఎమ్మెల్యేలకు తెలపడంలో విఫలమయ్యారని వీరాచారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార నిర్వహణలో జరిగిన తప్పును సరిచేసేందుకు ఇలా తిరిగి చాపకూడు సహపంక్తి భోజనాలను అమలు చేస్తున్నట్లు వీరాచారులు తెలిపారు. ఇది ఎవరిని నొప్పించడానికి చేయడం లేదని పేర్కొన్నారు.

క్రీస్తు జననం లోకానికి వెలుగు

ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ డా.ప్రతాప్ సింహాకొమానపల్లి

చిలకలూరిపేటటౌన్: క్రీస్తు జననం లోకానికి వెలుగు అని ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షు లు బిషప్ డా.ప్రతాప్ సింహాకొమానపల్లి సందేశం అందించారు. పట్టణంలోని యేసుక్రీస్తు దివ్యశాంతి నిలయంలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీపాస్టర్స్ ఫెలో షిప్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పాస్టర్ నందమూరి క్రిష్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాల్లోని పాస్టర్లు హాజరయ్యారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా. డేనియల్‌పాల్, గుంటూరు జోనల్ చైర్మన్ డా ఎంఎస్ విక్రాంత్‌వర్ధన్, పల్నాడు జిల్లా సలహాదారులు సుధీర్‌కుమార్, జనరల్ సెక్రెటరీ బిషప్ డా. జె.జయరావు పాల్గొని దేవుని వాక్య పరిచర్యల చేశారు.

వర్షాలతో రైతుల ఇక్కట్లు



ఆరబోసిన ధాన్యం తడవకుండా కప్పిన పట్ట

కారెంపూడి: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కోతకు వచ్చిన వరి పైర్లు వణికిపోతున్నాయి. సోమవారం ఉదయం కొద్దిసేపు, సాయంత్రం 4 గంటలకు మరో సారి కారెంపూడి మండలంలో వర్షం పడింది. దీంతో వరి కోసి కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు ధాన్యం రాసులపై పట్టాలు కప్పడానికి ఉరుకులు పరుగులు తీశారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని అమ్మే ప్రయత్నం చేసినా వాటిని తక్కువ ధరకు అడుగుతుండడంతో చాలా మంది రైతులు తక్కువ ధరకు అమ్మలేకపోయారు. మరి కొందరు తెగనమ్మారు. మరీ ఎరువులు, పురుగు మందుల కొట్లలో బాకీలున్న రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మేసుకున్నారు. ఇదిలా ఉంటే కోతకు వచ్చిన వరి పైర్లు చిగురుటాకుల్లా వణికిపోతున్నాయి. వర్షం నీటి బరువుతో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. పైర్లు నేలవాలితే జరిగే నష్టాన్ని తలుచుకుని రైతులు తల్లడిల్లిపోతున్నారు. కోసిన వరి పైర్ల వరి గడ్డి వర్షానికి తడిసి పనికిరాకుండా పోయింది. గొడ్ల నోటికొచ్చిన వరి గడ్డి పాడైపోతుండడంతో మరి కొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు. పడిన ప్రతి చినుకు రైతుకు నష్టం కలిగించేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ జి.పాపారావు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం గుల్లసముద్రంకి చెందిన మోతుకూరి ఏడుకొండలు(32) ఆదివారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామానికి వస్తున్నాడు. ఇరికేపల్లి బోటు వద్ద ప్రమాదవశాత్తూ ఆటోని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఏడుకొండలు తీవ్రంగా గాయపడటంతో స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడని ఎస్‌ఐ వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాపారావు తెలిపారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం



మాచర్ల: డ్వాక్రా మహిళలు పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్కీమ్‌ను ప్రారంభించి లబ్ధి పొందాలని మెప్మా ప్రాజెక్టు పట్టణ ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్, సీఓ అంజలి తెలిపారు. సోమవారం పురపాలక సంఘ ప్రాంగణంలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ప్రధానమంత్రి స్వనిధి, స్వాభిమాన్, పథకం గురించి డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు సిబ్బంది, ఆర్పీలు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.